రడ్ యార్డ్ కిప్లింగ్ యిచ్చిన సమస్యకు కథ

# (అ)సావేరి

భాగవతుల లలిత శర్మ

"ఎందుకిలా చేసేరు?"

సమాధానం ఓ వెర్రి నవ్వు!

"పోనీ-చేసే ముందేనా నాకు చెప్పాలని తోచలేదా?"

జవాబు ఓ నిర్లిప్తమైన చూపు!

అంతే! అంతకంటె ఆశించడం తన బుద్ధి తక్కువ! ప్రతీదీ అంతే!

అనాలోచితంగా చేసెయ్యడం, ఆ తరువాత తనకి తీరిగ్గా చెప్పడం! అప్పుడు ఆలోచించాలి తను-'భగవంతుడా! ఏందారి- ఈ గండం ఎలా గడుస్తుంది? అని. ఈ మనిషితో సంసారం ఇలా సాగవలసిందే ఇంక!' సావేరి కోపంగా, అసహనంగా చూసింది సూర్యంవేపు.

మేష్టరు ముందు తప్పులకి సిద్ధంగా నిల్చున్న విద్యార్థిలాగా బిక్క మొహంతో చూసాడు సూర్యం. ఇది అసలు భరించలేదు సావేరి.

గబగబా అక్కడి నుంచి ఇవతలికి వచ్చేసి, మేడ మెట్లెక్కి డాబా మీద నిల్చుంది సావేరి. అక్కడ నుంచి సముద్రం బాగా కనబడుతుంది. 'ఈ సముద్రానికీ, నాకూ తేడాలేదు' అనుకుంది సావేరి. పెళ్ళయి, ఇక్కడికి వచ్చిన కొత్తల్లో అయితే సాయంత్రాలు డాబా మీద నిల్చొని చూస్తే, యీ సముద్రమే ఎంతో అద్భుతంగా, ఆశ్చర్యంగా కనిపించేది. తనలాగే కొత్త చైతన్యంతోనూ, ఉద్వేగంతోనూ పరవళ్ళు తొక్కుతూన్నట్టు అనిపించేది. రాను రానూ అనిపించసాగింది, 'అబ్బ! ఒక్క క్షణం ప్రశాంతంగా వుండరాదూ, ఎప్పుడు చూసినా ఎడతెరిపి లేని కెరటాలు, ఉండుండి రిథమిక్ గా వినిపించే రొద! ఆ రొదకీ, ఆ కల్లోలానికి అంతులేదూ! తన బతుకులాగే! మొదట్లో ఎంత అందంగా వుండేది? మంచి ఇల్లు, అందమైన భర్త, డబ్బుకు లోటులేని ఆర్థిక స్థితి! రానురానూ అర్థమైంది, ఎంతెంత సమస్యల బతుకో! భర్త మంచితనం వెనకనున్న తెలివితక్కువతనం, అమాయకత్వం వెనుకనున్న చేతకానితనం! అవితెచ్చిపెట్టే సమస్యలతో ఎప్పుడూ తన మనసు కోపంతోనూ, బాధతోనూ అల్లకల్లోలంగా వుంటుంది. ఒక్కరోజు, పోనీ ఒక్క క్షణం-తన మనసు ప్రశాంతంగా గడిపిందా? అతగాడు చేసే తెలివితక్కువ పన్లకూ, అందుమూలంగా ఏర్పడే సమస్యలకు పరిష్కారం ఆలోచించడంలోనే గడిచిపోతోంది బతుకంతా. ఒకే ఊళ్ళో వుంటూ, స్వంత అన్నగారయి వుండీ-ఆ పార్థసారథి ఇలాగే వున్నాడా! ప్రతీదీ తమ్ముడి నెత్తిన రుద్ది, తను తెలివిగా తప్పించుకుంటాడు. ఇంతకీ-ఈ గండం గడవాలంటే-ఏం చెయ్యాలి తను ఇప్పుడు?'

"సాధన వస్తోందిట!"

ఆ పేరు తల్చుకుంటేనే చాలు సన్నటి ఒణుకులాంటిది బయలుదేరింది సావేరికి. ఆ అమ్మాయి ఉనికి ఎడారిలో ఇసక తుఫాన్ను, బంగాళా ఖాతంలో వాయుగుండాన్ని జ్ఞప్తికి తెస్తాయి.

"ఇక్కడ పేయింగ్ గెస్టట!"

తనకి ఎదురయే యీ గండాన్ని ఊహించుకొని ఉక్కిరిబిక్కిరయి, ఊపిరి ఆడనట్టూ అయిపోయింది సావేరికి.

'సాధన, పార్థసారథికి భార్యవైపున చుట్టం. ఆ మాట కొస్తే వాళ్ళు భరించాలి ఈ బాధ్యతని! సాధనకి ఈ ఊళ్ళో ఉద్యోగం దొరికిందట. 'చిన్నానా, మీ ఇంట్లో వుండాలనుకుంటున్నాను' అంటూ వుత్తరం రాసిందిట. భార్య ఒప్పుకుంటే ఏంచేసేవాడో మరి! కాని ఆ మహాతల్లికి మరొక ఆడదాని పొడ గిట్టదు. ఎంత తెలివితక్కువదీ, అబసంతిదీ అయినా, నోరు పెట్టుకొని మొగుణ్ణి గెలుచుకుంటుంది ఎప్పటికప్పుడు. అసలు ఆ తెలివితక్కువ తనమే ఓ ఆయుధం ఆవిడకి! తనకిష్టం లేనిది ఏం జరిగినా, పెద్ద గొడవ పెట్టుకొని ఇంటి గుట్టు కాస్తా రోడ్డు కీడుస్తుంది. నలుగురూ వింటారు, పరువు పోతుంది-ఇలాంటివేమీ తెలియవు ఆవిడకి. తను అన్నట్టూ జరగవలసిందే. పరిస్థితి విషమించకుండానే, అతగాడు గుట్టుగా సర్దుకుపోతాడు. ఇంత తెలివైన మనిషీ ఆవిడగారి అబసంతి తనానికి లొంగిపోయాడు. ఓహ్-భగవంతుడు-ఎలా కూర్చుతాడు...తెలివైన భర్తలకి తెలివి తక్కువ పెళ్ళాలూ, తెలివితక్కువ భర్తలకి తెలివైన పెళ్ళాలు! తెలివైన భర్తని అదుపులో పెట్టడానికి భార్యకి తెలివితేటలు లేకపోయినా ఫరవాలేదు. కాని-తెలివి తక్కువ భర్తతో కాపురం చెయ్యడానికి మాత్రం భార్యకి అమోఘమైన తెలివితేటలు వుండాలి. లేకపోతే-వాళ్ళ దాంపత్యం...

'అందులోకీ తన భర్తలాటి వాడు అయితే మరి అడగక్కరలేదు! అన్నగారు కాస్తా, 'మా ఇల్లు చిన్నది-నీకిబ్బంది అవుతుంది. మా తమ్ముడిగారి ఇల్లయితే విశాలంగా, నీకు సౌకర్యంగా వుంటుంది- నీ కభ్యంతరం లేకపోతే అక్కడ వుండొచ్చు'—అంటూ ఓ సలహో పారేసి చల్లగా తప్పుకున్నాడు. ఆ అమ్మాయి వెంటనే ఈయనగారి ఆఫీస్ ఎడ్రస్‌కి ఓ ఉత్తరం రాసి పడేసింది-'నేనొచ్చేస్తున్నాను సుమా!' అంటూ. 'తప్పకుండా రా! మా ఇంట్లో నీకేలోటూ జరగనివ్వం!' అంటూ హామీ పత్రం ఒకటి జతచేసి మరీ జవాబు రాసారట ఈయనగారు!' జరిగింది తల్చుకొని నీరసంగా నిట్టూర్చింది సావేరి. 'సాధన మామూలు ఆడపిల్ల అయితే తను ఇంతగా బాధపడకపోను!'

మొదటిసారి సాధనను ఎవరి పెళ్ళిలోనో చూసింది సావేరి. ఓవర్ ఏక్టివ్! ఎవర్నీ కేర్ చెయ్యదు. కబుర్లతో ఊదరగొట్టి ఎదుటి వాళ్ళని ఊపిరి పీల్చుకోనివ్వదు. ఎంతటి వాళ్ళనైనాసరే, నిల్చున్నపాటున సినిమాకెళ్దాం పదమంటుంది. 'ఇది చాలా బావుందండోయ్-మీరేమీ అనుకోకపోతే నేను తీసేసుకుంటున్నాను' అంటూ ఎంత ఖరీదైన వస్తువైనా స్వంతం చేసేసుకుంటుంది. తనక్కోపం వస్తే ఎంతమాటైనా అనేస్తుంది. తనవి చాలా అసామాన్యమైన తెలివితేటలు అనుకుంటుంది. అప్పటికప్పుడు అతి స్నేహాన్ని, చనువునూ పెంచేసు కుంటుంది అందరితోనూ! ఆ చొరవకీ, చనువుకీ లింగబేధం వుండదు! తన గురించి ఎవరేమనుకుంటున్నారో తనకక్కర్లేదు. తండ్రి లేదు! తల్లి ఈ అమ్మాయి ధాటికి తట్టుకోలేక పూర్తిగా వదిలేసింది. 'ఇలాంటి వాళ్ళు ఉద్యోగాలు ఎలా చేస్తారో!' అనుకుంది సావేరి! 'ఇలాంటి వాళ్ళని దగ్గర పెట్టుకుంటే తమ పరువుకూడా గంగలో కలుస్తుంది-అయినా ఈ రకం మనుషుల్ని భరించే శక్తీ, అవసరం కూడా తనకు లేవు! ఏదో చూడాలి మార్గం! ముందు-ఈయనగార్ని ఎక్కడికేనా అంపకం పెట్టేయాలి! వచ్చేవారమేగా తన స్నేహితుడి పెళ్ళి! కాస్త ముందుగా పంపించేస్తేసరి-'మీ నాన్నగార్ని కూడా చూసిరండి-పనిలోపని...' అంటూ ముందు ఈయన గార్ని ఇంట్లోంచి దాటించాలి!'

"అమ్మా-ఆకలేస్తోంది-కిందకిరా!" ఆరేళ్ళ పద్మ మెట్లమీద నిల్చొని కేకవేసింది.

"పద! వస్తున్నా..." ఆలోచనలు కట్టిపెట్టి కిందకి దిగింది సావేరి.

* * *

అనుకున్న ప్రకారం వచ్చేసింది సాధన-సుడిగాలిలాగ!

"ఆంటీ-నేను వచ్చేశాను చూస్కోండి! అంకుల్ చెప్పేరా మీకు నా గురించి?" అంది-వస్తూనే ఇల్లంతా కలియదిరుగుతూ, చేతికందిన వస్తువల్లా చక్కబెడుతూ!

"చెప్పేరులే! ఎప్పుడొస్తావా అని ఎదురుచూస్తున్నాను అప్పట్నుంచీ! నువ్వురాగానే ఇంటికి కొత్తకళ వచ్చింది చూశావా!" అంది సావేరి-మొహమంతా నవ్వులు పులుముకుంటూ.

"ఏయ్ పాపా! ఇలారా... డిస్కో వచ్చా నీకు! నే నేర్పుతాను రా ఇటు- అంటీ-ఈ టేప్ రికార్డర్ ఫారెన్‌ది కదూ-ఎంత బావుందో! మీదంటే-నాదన్నమాటే!" అంటూ కాసెట్ల స్టాండులో కాసెట్లన్నీ కిందామీదా చేస్తూ-'డిస్కో' కోసం కాబోలు వెతకసాగింది.

"నువ్వు ముందు స్నానం చెయ్యి-భోజనాలు చేద్దాం! అదుగో! ఆ గది నీ కోసం ఖాళీ చేయించేను-అందులో నీ సామాన్లూ అవీ సర్దుకో!" అంది ఆప్యాయంగా సాధన చెయ్యి పట్టుకొని.






"అబ్బ-సర్దుకుంటాను లెద్దురూ-పోనీ-మీరు సర్దేయండి-నాకు మహా బద్ధకం-నా సంగతి తెలుసుగా మీకూ...ఇంతకీ అంకుల్‌ని ఎక్కడ దాచేశారు? కనబడరేం?" అంది మంచం మీద అడ్డంగా పడుకొని దొర్లుతూ.

"ఆయన గుంటూరు వెళ్ళారులే! అఫీషియల్ టూర్! రెండు, మూడు రోజుల్లో వచ్చేస్తారు! మీ అమ్మ బావుందా! ఎప్పుడు జాయినవాలి నువ్వు ఆఫీసులో!" అంటూ కబుర్లలోకి దించింది సావేరి.

"బాబోయ్, ఇంకా రెండు రోజులే! మా అమ్మా? బాగానే వుంది... రేపే జాయినవాలి నేను ఆఫీసులో!" అంది బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ. "ఆంటీ! నేనిక్కడుంటే మీకేం ఇబ్బంది లేదుకదా! మరేం లేదు- మనవాళ్ళు అంటూ వుండగా వేరే రూం తీసుకోవడం, హోటల్ తిండీ ఎందుకూ-డబ్బుదండగనీ..." కూర కలుపుకుంటూ అంది సాధన.

"ఇబ్బందా? ఇంకా నయం! మంచి టైముకి వచ్చేవని నేను సంతోషిస్తూ వుంటే... నిజంగా దేముడు పంపి నట్టే వచ్చావనుకో! మరో ఆడసాయం లేందే-'ఈ గండం' గడిచేదెలాగా అని నేను ఎంత బెంగపెట్టుకున్నా ననుకున్నావ్! నీ ఉత్తరం చూడగానే ఆ బెంగతీరిపోయిం దనుకో!"

నోట్లో పెట్టుకున్న ముద్ద మింగుడు పడలేదు-సాధనకి! సావేరి మాటలు అర్థంకాక బొమ్మలా వుండిపోయింది కొన్ని క్షణాలు. సావేరి అదేం పట్టించుకో

## రడ్‌యార్డ్ కిప్లింగ్ వ్యాఖ్యపై వచ్చిన కథలు

శ్రీ బీయార్ —చిదంబర రహస్యం'
శ్రీ ఆర్.వి.రమణప్రసాద్ 'వల'
శ్రీ విరించి 'అకారణం'
శ్రీమతి ఎం.విద్యుల్లత 'ఓహ్హో! నా పెళ్ళామా
శ్రీమతి భాగవతుల లలిత శర్మ '(అ) సావేరి'
శ్రీ వెల్చేరు చంద్రశేఖర్ 'క్లెవర్ గర్ల్'
శ్రీమతి కొవ్వలి నాగేశ్వరి 'ఆకూ-వక్క'
శ్రీమతి నెల్లూరి పార్వతీదేవి 'ఇల్లుపట్టిన శని'
శ్రీ ఎన్. జగన్ మాధవరావు 'తెలివైన అర్ధాంగి'

ఈమొత్తంతొమ్మిది కథలలో ఏది ఉత్తమమైనది నిర్ణయించే బాధ్యత పాఠకులదే. ఈ కథలను 17-1-86 సంచిక నుంచి ప్రచురిస్తున్నాము.

పాఠకులు కూపన్‌లో నాకు నచ్చిన కథ 'పేరును' వ్రాసి పంపితే ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు కథలకు 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలు ఇప్పటి వరకూ లభ్యమైనవి చెరి ఒక సెట్ బహూకరిస్తాము. పాఠకులు 9 కథలను వరుసగా చదవాలి. 9 వ కథ ప్రకటించిన వారం రోజుల వరకు పాఠకులు తమ ఓట్లను పోస్ట్ కార్డుల ద్వారా కూడా తెలియపరచ వచ్చును.

—ఎడిటర్

### నాకు నచ్చిన కథ కూపన్

కథ పేరు ----------------------------
పంపిన వారి పేరు ----------------------
చిరునామా ---------------------------
------------- ----------------------

(సంతకం)

నట్టు, సాంబారు కలుపుకుంటూ చెప్పుకుపోతోంది- తన ధోరణిలో!

"ఇదేం కొత్త జబ్బుకాదనుకో! అయినా ఏడాదై బాధ పడుతున్నాను. నెలనెలా గండమేననుకో! ఎన్ని మందులు వాడినా ఒక్కలాగే వుంది. ఆఖరికి మొన్నీమధ్య లేడీ డాక్టర్ పరీక్షచేసి చెప్పింది- 'యుటెరస్' తీసేయాలిట- ఇప్పటికే పచ్చిపుండయిపోయింది- ఆలశ్యం చెయ్యొద్దు అంటూ హెచ్చరించింది. ఈ వారంలో వెళ్ళి జాయినైతే- ఆపరేషన్ చేస్తానంది! పరిస్థితి ఎలా వచ్చిందో చూడు- సరిగ్గా ఈయనకీ ఈ వారంలోనే ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్స్! రాత్రీ, పగలూ ఆఫీసు కంకితం అయిపోతారు. రెండు పూట్లా భోజనం కేరేజీ పంపించాలి! పోన్లే-నువ్వు వచ్చావుగా- మరి బాధలేదు. పై వాళ్ళయితే మొహమాటం గానీ- నువ్వు మా ఇంట్లో మనిషికిందే లెక్క! మా ఇంట్లో పనేం పెద్దగా వుండదు! ఏ ముంది... పొద్దుటే పద్మని తయారుచేసి స్కూలికి పంపిస్తావు. వంటచేసేసి ఆయనకి కేరేజీ సర్దేసి ఇచ్చేస్తావు. నీ భోజనం అయేక నా కేరేజి పట్టుకొని హాస్పిటల్‌కి వచ్చేస్తే-అట్నుంచి అటే నువ్వు ఆఫీసుకెళ్ళిపోవచ్చు. పద్మ స్కూలు నించి వచ్చి పక్కవాళ్ళింట్లో కూర్చుంటుందిలే-ఇదంటే ఆవిడకి మహా ముద్దు! సరే- సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే కాఫీ-టిఫిన్ చేసి యిస్తే పక్కవాళ్ళ బాబు నాకు అందిస్తాడు. రాత్రి వంట తాపీగా చేసుకుని ఎనిమిది గంటల్లోపున నాకు భోజనం తెచ్చేద్దువుగాని-హాస్పిటల్ నుంచి వచ్చాక కూడా కొన్నాళ్ళపాటు బాగా రెస్ట్ తీసుకోవాలిట- ఏమిటో...రాకరాక వచ్చినందుకూ నిన్ను ఇబ్బంది పెట్టాల్సివస్తోంది. నువ్వేనా పై దానివి కాదు అనుకో! అయినా...డబ్బిచ్చి మనుషుల్ని పెట్టుకుంటే మాత్రం ఇంటి మనుషులికి సాటొస్తారా చెప్పు- డబ్బు దండగే కానీ...ఇంతకీ నువ్వీ టైమ్‌లో రావడం నా అదృష్టమే మరి!" సావేరి చెప్పుకుపోతూనే క్రీగంట చూసింది సాధనవేపు.

ఆ అమ్మాయి మొహంలో రక్తపు చుక్కలేదు!

ఎంగిలి చెయ్యి ఎండిపోతున్నదన్న ధ్యాస కూడా లేనట్టు నిస్పహాయంగా వింటోంది సావేరి మాటల్ని- భోజనం మాట మర్చిపోయి.

మర్నాడుదయం కాఫీ కలుపుతున్న సావేరి కొంగు పట్టుకు లాగడం మొదలెట్టింది పద్మ హడావిడిగా-

"నిన్న కొత్తగా వచ్చిందే-ఆ అక్క చూడు-ఏం చేస్తోందో?"

"ఏం చేస్తోంది?" అంది సావేరి తాపీగా.

"చూడు నువ్వొచ్చి!" చెయ్యి పట్టుకొని బయటికి లాక్కెళ్ళింది పద్మ.

అప్పటికే సాధన తన సామాన్లన్నీ సర్దేసుకొని రెడీగా గుమ్మంలో నిల్చుంది.

"అదేమీ-వెళ్ళిపోతున్నావా?" అంది సావేరి మొహాన ఆశ్చర్యాన్ని పులుముకొని.

"ఔనండీ-మీరేమీ అనుకోకపోతే...మీ ఇంటి నుంచి ఆఫీసు చాలా దూరం అవుతుంది. రిక్షాలకే పొయ్యాలి బోలెడు డబ్బు! అందుకని-అక్కడికి దగ్గరగా- ఏదైనా...రూం చూసుకుంటే బావుంటుందనీ... నే వెళ్ళి రిక్షా పిలుచుకొని వస్తాను..." అంటూ మరో మాట కవకాశం లేకుండా బయటికి పరుగెత్తింది.

కదుల్తున్న రిక్షాని చూస్తూ 'హమ్మయ్యా! ఓ గండం గడిచింది' అనుకుంది సావేరి.

*



